# వేపచెట్టు

శ్రీశాంతి దుగ్గిరాల



**కథ:** వేపచెట్టు

**రచన:** శ్రీశాంతి దుగ్గిరాల

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జులై 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3107

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# వేపచెట్టు

ఆ ఇంట్లోకి మేం అద్దెకొచ్చి పదేళ్ళు పూర్తయ్యాయి. ఏడాదిలో ఓసారి ఆకస్మిక తనిఖీ చేసి వెళుతుంది మా ఇంటి ఓనరు ఆదిలక్ష్మిగారు. ఆ ఏట ఇంటి మరమ్మత్తులేమన్నా ఉంటే చేయించేసి వెళుతుంది. మనిషి చాలా మంచిది, జాలీ, ప్రేమా ఎక్కువే. కాస్త అమాయకురాలు కూడాను. ఎవరేం చెప్పినా ఇట్టే నమ్మేస్తుంది.

నెలనెలా అద్దె మాత్రం రమణమూర్తి అని ఆదిలక్ష్మిగారి దూరపు బంధువు వసూలు చేస్తాడు. ఈ మనిషి పైకి కనిపించినంత మంచోడేంకాదు. ఆదిలక్ష్మిగారికి ఈ ఊళ్ళో ఆస్తులు చాలానే ఉన్నాయి. ఆమెకి అద్దె ఓ లెక్కకాదు. రమణమూర్తి అది అలుసుగా తీసుకుని సంవత్సరం వసూలు చేసిన అద్దెనంతా తన దగ్గరే ఉంచుకుని వడ్డీకి తిప్పుతాడు. ఆవిడొచ్చే సమయానికి జమవేస్తూ ఉంటాడు.

పైకి మా అందరితో "ఈ చాకిరీ ఎవరు చేస్తారు. నాకా వయసైపోతుంది. ఆదిలక్ష్మిగారు రాగానే అన్నీ అప్పగించేస్తాను" అంటూ తెగ రాగాలు తీస్తాడు. ఈ పదేళ్ళమట్టీ మాకా మాటలు వినీ వినీ అలవాటైపోయాయి.

మేమాఇంట్లో దిగేటప్పటికి ఓ మొక్క కూడా ఉండేది కాదు. నాకు మొక్కల్లేకపోతే ఊపిరాడనట్టు ఉంటుంది కాబట్టి వచ్చిన ఏడాదిలోనే గేటువారగా ఇరుపక్కలా ఓ పసుపుపువ్వుల చెట్టు, పారిజాతం, ఆపైన నూతివారగా అరటి చెట్లు, బోన్సాయి మర్రి చెట్టు, గోరింట చెట్టు పెంచాను. ఇంకా ఇంటి చుట్టూ కుండీల్లో రకరకాల గులాబీలు ఒకదాంతో ఒకటి పోటీపడుతూ ఉంటాయి. "ఇవిచాలవన్నట్టు వీధిలోకొచ్చే ప్రతి మొక్కలాడి సైకిలూ ఎందుకాపిస్తావే" అని నాన్నగారు తిట్టేవారు. రోజంతట్లోనూ నేను మనసుపెట్టి చేసే పనులలో మొక్కలకు నీళ్ళు పోయడం ఒకటి. అమ్మానాన్నలకు మొక్కలంటే ఉన్న ఇష్టం నాకూ అంటింది.

నా మొక్కలపెపకం రమణమూర్తికి సుతరామూ ఇష్టంలేదు. ఆదిలక్ష్మిగారు కూడా మొక్కలంటే ఇష్టపడతారు. నా ఇష్టాన్ని చూసి రెండు మల్లె మొక్కలు ఇచ్చారావిడ. కనుక రమణమూర్తి మారు మాట్లాడలేక మిన్నకుండిపోయాడు.

కొన్నాళ్ళకు ఉదయం నీరెండ పడేచోట లోపల ప్రహరీకానుకుని మొలిచిందో వేపచెట్టు. ఎవరో శ్రద్ధగా తెచ్చినాటిన మొక్కకాదది. బాగా పండిన వేపపళ్ళను తిన్న కాకి వేసిన విత్తు అది.

ఉదయం లేవగానే చిన్నగాలికే ఊగిపోతూ పలకరించేది నన్ను. దాని సమక్షంలో గడపడం అలవాటైపోయింది నాకు. నా ఆనందం, విచారం అన్నీ దానితో చెప్పుకునేదాన్ని. దాని ప్రతి కదలికలోనూ నీకు నేను ఉన్నాను అన్న ఆప్యాయత కనిపించేది నాకు. వీధి పక్క గుమ్మానికి ఎదురుగా నిలబడి కొమ్మలన్నీ ఊపుతూ చూసేది నన్ను. తొలి కిరణాలు పడే వేళ పలకరింపులైపోయినా సాయంత్రం మళ్ళీ దాని సమక్షంలోనే గడపాలనిపించేది. గులాబీలతో చెప్పిన ఊసులకన్నా, వేపచెట్టుతో పంచుకున్న రహస్యాలే ఎక్కువ నాకు. మిగతా మొక్కలన్నా అభిమానమే గానీ ఎందుకో ఈ వేపచెట్టంటే చెప్పలేని ఇష్టం ఏర్పడిపోయింది.

రెండేళ్లకి అది పెద్ద మానయిపోయింది. ఈ సంవత్సరం ఉగాదికి కాపు పడుతుందన్నారు చుట్టు ప్రక్కలవాళ్ళు. అందరి కళ్ళూ నా వేపచెట్టు మీదనే.

నేను కనిపించినప్పుడల్లా.... పక్కింటి పార్వతమ్మయితే “హూ ఈ సంవత్సరం వేప్పువ్వుకు ఎక్కడికీ వెళ్ళక్కరలేదులే పక్కింట్లోనే ఉందిగా” అంటూ సాగదీసేది.

ఇక మా అమ్మయితే వేపచెట్టు ఉపయోగాల గురించి పెద్ద పాఠమే చెప్పేది వేపచెట్టు గాలి ఎంతో మంచిది. వేపచెట్టులో మనిషికి ఉపయోగపడనిదంటూ ఏదీలేదు. ఇరుగుపొరుగోళ్ళు దాని గురించి ఏం మాట్లాడినా ఏదో చెప్పలేని గర్వంగా అనిపించేది నాకు.

వాళ్ళంతా అనడం కాదుగానీ వేపచెట్టు నిండుగా కొమ్మ కొమ్మకూ విడవకుండా పూతపూసింది. రాత్రిపూట నక్షత్రాల్లా మెరుస్తున్నాయి ఆ పూలు. కమ్మని వేప్పువ్వు వాసన గుండెనిండా పీలుస్తూ లోలోపలే ఆనందపడిపోతున్నాను. చూస్తేనే దిష్టి తగిలేట్టుగా, రెండుకళ్ళూ సరిపోనంత బాగుంది నా వేపచెట్టు.

ఈ సంవత్సరం ఆదిలక్ష్మిగారు ఓ రెండు నెల్లు ముందుగానే వస్తానని కబురంపారు. నాకూ ఆవిడకు వేపచెట్టు చూపించాలని తెగ తొందరగా ఉంది. ఆదివారం నాడు రమణమూర్తి వచ్చాడు. ఆదిలక్ష్మిగారు రేపు ఉదయానికి వస్తున్నారు పైన గది సిద్ధం చేయాలనిచెప్పి, ఎవరితోనూ పెద్దగా మాట్లాడకుండానే వెళిపోయాడు.

మరునాడు ఉదయం పదిగంటలు కావస్తుండగా వచ్చారు ఆదిలక్ష్మిగారు. ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఆ ముఖం ఈరోజెందుకో కాస్త చిరాకుగా ఉన్నదనిపించింది. రావడమే ఇంటి చుట్టూ తిరిగి మొక్కలన్నీ చూడడానికి బైలుదేరింది. నేను వెంటనడిచాను.

అన్నీ చూసాకా వేపచెట్టు దగ్గర ఆగిపోయింది. నేను ఉత్సాహంగా చెప్పడం మొదలు పెట్టాను. "ఈ వీధివాళ్ళ కళ్లంతా దీని మీదనేనండి. పూత చూసారా... అసలు మొదటిసారి పూతలా పలుచగా లేదు కదూ" అంటూ తెగవాగుతున్నాను.

ఆమె నా మాటలు లెక్కచేయనేలేదు. ఎంతో కరుకుగా వచ్చాయి మాటలు. "ఏంటిది గోడవారగా వేపచెట్టు మొలిచి ఇంత పెద్దదైపోయినా నాకు చెప్పనేలేదు. గోడ పాడయిపోతుందని ఎక్కడన్నా అనిపించిందా మీకు! మీ సొంతిల్లైతే ఇలానే చేస్తారా". ఆవిడ అనాలనుకున్నవి, రమణమూర్తి ఎక్కించినవీ కలిపి అన్ని మాటలూ అనేసింది.

ఆవిడ మాటలకు కోపం వస్తున్నా ఇంకా ఏదో చెప్పాలనుకుంటున్నా నా మాటలకు అడ్డు వచ్చి "రెండు రోజుల్లో ఈ చెట్టు కొట్టించేయండి ఆ పని నేనుండగానే జరిగిపోవాలి తెలిసిందా చెప్పు మీ నాన్నగారితో" అంటూ రుసరుసా వెళిపోయింది.

నా గుండె జారిపోయింది. కళ్లమ్మటా నీళ్ళు కారుతున్నది కూడా గమనించలేదు. ఏంటీవిడ ఇంత ఎదిగిన మొక్కను తీసేయమంటుంది, ఇంటి యజమాని కదా ఏం చేసినా చెల్లుతుందనుకుంటుందేమో.

నాన్నగారితో విషయం చెప్పాలని పరుగెత్తాను. ఆయనంతా విని "నిజమేకదే ఆవిడ ఏదో రోజు అంటారనుకుంటూనే ఉన్నాను. ఆ మొక్క పెరిగే కొద్దీ గోడ కూలిపోతుంది. ఈ పని మనం చిన్న మొక్కగా ఉన్నపుడే చేసి ఉండాల్సింది. చాలా ఆలస్యం అయిపోయింది" అన్నారు.

నాకా రోజంతా మనసు దిగాలుగా ఉంది. దొడ్లో వేపచెట్టు చూసిన ప్రతీసారి కన్నీళొస్తున్నాయి. ఈ విషయాలేవీ తెలీని ఆ పిచ్చి మొద్దు నన్ను చూసి కొమ్మలన్నీ ఊగేలా నవ్వుతుంది.

ఆ రోజు రానే వచ్చింది. ఉదయాన్నే ఆదిలక్ష్మిగారు, రమణమూర్తీ వచ్చేసారు. వస్తూనే వాళ్ళకూడా ఇద్దరు కూలీలను తీసుకొచ్చారు.

నేను ఎంత వాదిస్తున్నా “నీకేవమ్మా ఎన్నయినా చెపుతావు ఇలాగే వదిలేస్తే గోడ బీటలు బారి, కొన్నాళ్ళకు కూలిపోతుంది” అంటూ నాకు అడ్డు తగిలాడు రమణమూర్తి.

నాన్నగారిని పట్టుకు ఏడ్చాను. ఆయన వాళ్ళకు అడ్డురాకపోగా నాకే నచ్చజెప్పారు. “చూడు మన సొంతింట్లో ఎన్ని మొక్కలేసుకున్నా పరవాలేదు. అంత స్తోమత మనకులేదని నీకూ తెలుసు ఇప్పుడు ఇంకా రభస చేస్తే మనల్నే ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటారు. అంతవరకు తీసుకురాకు, జరుగుతున్నది చూస్తూ ఊరుకోవడం తప్ప ఏం చేయలేం” అని చెప్పి పని మీద బైటకెళ్ళిపోయారు.

నేను బైటికి వెళ్ళలేక కిటికీలోంచి చూస్తూ ఉండిపోయాను. చెట్లు కొట్టే వాళ్లు వేపచెట్టు దగ్గరకు రాగానే పక్కింటి పార్వతమ్మ పెద్ద నోరుతో “ఏవండో ఆదిలక్ష్మిగారు చెట్టు ఒక్కసారిగా కొడితే మా ఇంటి ప్రహరీ మీదపడుతుంది కొంచెం చూసి కొట్టించండి” అంది.

దాంతో అంతా కలిసి ఆ జాగ్రత్త తీసుకోవడంలో పడ్డారు. ముందు వేపచెట్టు పెద్దమానుకి ఒక తాడు బిగించారు. పైనున్న కొమ్మలన్నీ నరికేసారు. తర్వాత కింద వేళ్ల దగ్గర మాను కొట్టి, ఇంక పడిపోతుందనగా కొట్టడం ఆపి, అంతా కలిసి బలంగా తాడు పట్టుకుని ఇవతలికి గుంజారు. వేపచెట్టు కాళ్లు నరికిన మనిషిలా కుప్పకూలిపోయింది. ఒక్కరోజులో నాతో ఎన్నో జ్ఞాపకాలు పంచుకున్న నా నిలువెత్తు నేస్తం నిర్జీవమైపోయింది. ఆకాశం బోసిపోయినంత ఖాళీ మా ఇంటిని ఆవరించింది. చాన్నాళ్ల వరకూ బయట నుంచి చూసినపుడు మా ఇల్లు కళ కోల్పోయినట్టు కనిపించేది.

రమణమూర్తి పనివాళ్ళ చేత కొమ్మలూ మిగతా తుక్కూ అంతా ఏరించాడు. మాను మాత్రం “ఎందుకన్నా పనికొస్తుంద”ని చెప్పి మా ఇంటి బయటి గేటు ముందు పెట్టించాడు. అది ఎండకి ఎండుతూ వానకు నానుతూ చాన్నాళ్లు అక్కడే పడి ఉంది. వంటింట్లోంచి చూసినా కూడా పచ్చగా ఆకులు ఊపుతూ పలకరించే చెట్టు ఇప్పుడు ప్రాణం లేని వస్తువైపడి ఉంది. ఇప్పటికీ నిశ్శబ్దంగా ఉండే మధ్యాహ్నం వేళల్లో దాని ఆకుల గలగలలు వినపడని లోటు తెలుస్తుంది. బాగా పూసిన ఏ వేపచెట్టు చూసినా నా వేపచెట్టే గుర్తొస్తుంది.

★

For Latest Telugu Books - Visit now:

Kinige.com